"చాల్లెండి" అంది రాధ క్రీగంట చూస్తూ.

ముగ్గురం కలిసి అరగంటసేపు కబుర్లు చెప్పుకున్నాము. తర్వాత రాధ కాఫీ పట్టుకొచ్చి యిచ్చింది. కాఫీ త్రాగాక. "వస్తాను' అంటూ సుశీల లేచింది.

"భలేవారు. భోజనం చెయ్యకపోతే వదుల్తాందనుకున్నారా యీ చెల్లెలు" అంది రాధ సుశీల చెయ్యిపుచ్చుకుని. ఆమాటతో రాధ మనస్సు యెంత నిర్మలమో నాకు మరింత చక్కగా అర్థమయింది.

"భోజనం పెడతానంటే వద్దంటానా?" అంటూ సుశీల కూర్చుంది.

రాత్రి భోజనాలు అయాయి మరి కాసేపు కబుర్లయ్యాక "వెళ్ళమనే లోగా వెడితే మంచిదనే సామెత వుంది. కనుక వెళ్ళొస్తాను. ఏం రాధా" అంది సుశీల.

"మళ్ళీ వస్తానంటేనే వెళ్ళనిచ్చేది" అంది రాధ.

"అహా! వచ్చేనెల పదో తారీకున యీ వూరు రావాలి. అప్పుడు మీరు వద్దన్నా మకాం మీ యింట్లోనే" అంది సుశీల.

రాధ తృప్తిగా నవ్వింది.

డ్రైవరు కారు తీసుకువచ్చాడు. సుశీల కారులో ఎక్కింది. "వస్తాను" అంది మాకేసి చూస్తూ.

"వచ్చేనెల పదవతేదీ తప్పక రావాలి" అంది రాధ.

"ఆ" అంది సుశీల స్టార్టయిన కారు శబ్దాన్ని మించి అరుస్తూ.

కారులో సుశీలని నేనే దింపుదామనుకున్నాను కానీ, ధైర్యం లేకపోయింది. కారు కదిలేదాకా యిద్దరం అలాగే నిలబడ్డాము లోపలకువస్తూ "ఆవిడ ఎంత మంచిదండీ - ఎంతమంచి మనస్సో-మనిషిని చూడగానే ఒక పవిత్రమూర్తిని చూచినట్టు అనిపించింది. నిజంగా మనుష్యుల్లో దేవతలుంటారనడానికి ఆవిడే తార్కాణం" అంది రాధ.

"ఏం?" అన్నాను నేను హాల్లో కుర్చీలో కూర్చుంటూ.

"ఏమో! అలా అనిపించింది. ఒక మనిషిని చూడగానే మంచిభావం, మరో మనిషిని చూడగానే చెడ్డభావం కలుగుతుందంటారుకదా-అలాగే నా కావిడ్ని చూడగానే అలా అనిపించింది. నిజంగా ఆ తెల్లటి దుస్తుల్లో ఆవిడ కారుదిగేసరికి మూర్తీభవించిన పవిత్రతలా కనుపించింది" అంది రాధ వుపన్యాసధోరణిలో.

రాధది కాస్త వుపన్యాస ధోరణిలో మాట్లాడే స్వభావమే అయినా చాలామటుకు నిజం వుంటుందని లోగడ చాలాసార్లు నేను గ్రహించిన విషయమే!

"ఏమిటాలోచిస్తున్నారు? ఏం మీకు నే నన్నమాటలు నచ్చలేదా" అంటూ రాధ నాభుజం పట్టుకుని కుదిపింది.

"ఏంలేదు. నువ్వు ఏది చెప్పినా అది నూరుపాళ్ళు సత్యం-నచ్చకపోవడమేమిటి? సుశీల నిజంగా దేవతామూర్తి! ఆమె మనస్సే అంత!" అన్నాను నేను రాధజడ చేత్తో పట్టుకుంటూ.

"మీకున్నకోపం కాస్త తగ్గితే మీరూ అంతే! మీ అంత మంచివారెవరూవుండరు" అంది.


నిజమే!

నిజమే! కోపం తగ్గాలి అనుకున్నాను నిశ్చయంగా.

○○○

జ్యోతి





# భంగవంతం

స్థిరమైన నడవడితోబాటు స్థిరమైన ఇరుగు పొరుగు సఖ్యత 'జనుల కందరకు వలయు' అని పూరాగా నమ్మినవాళ్ళలో భగవంతం ఒకడు.

స్థిరమైన నడవడి మాట సిగ్గోసిరి-అది అంత సులభంగా కనిపించలా. కాని స్థిరం మాట ఎలావున్నా ఇంతకాలం ఇల్లు లేక పోవటంవల్ల భగవంతానికి ఇరుగుపొరుగు సఖ్యతకే అవకాశం లేకుండాపోయింది. ఇప్పుడా లోటు తీరింది కనక అటునుంచి నరుక్కురావటానికి ఉపక్రమించాడు భగవంతం!

కొత్తఇంట్లో చేరిన మర్నాడే భగవంతం పై భాగంలోని సంగమేశ్వరంగారి భాగంలోకి వెళ్ళి తనను పరిచయం చేసుకున్నాడు. కాసేపు కబుర్లుచెప్పి, ఇంకా పై భాగంలో వున్న సౌభాగ్యంగారి భాగంలోకికూడా ప్రవేశించి అలాగే చేశాడు. పైనుంచి చూస్తే చుట్టూ వాతావరణం ఎంచక్కాగానో కనిపించింది. పై భాగం అద్దె ఎక్కువయినా అలాంటిచోట వుండే జీవితం చాలా హాయిగా వుంటుందికదా అని భగవంతం మనస్సు ఉవ్విళ్లూరింది. కాని ఇప్పటికే ఇంతయింది!

క్రిందికి వచ్చి తన భాగంలోకి అడుగు పెట్టగానే శ్రీమతి "మీకోసం పై సంగమేశ్వరంగారు కాబోలు వచ్చారు!" అంది.

"దేనికట?"

"ఇప్పుడే మీరు వారిని చూట్టానికి వెళ్ళారటగా-అందుకని మిమ్మల్ని చూట్టానికి ఆయన వచ్చారట! మీ రింట్లో లేరనగానే బయటివారు బయటినించే వెళ్ళిపోయారు!" అంది గృహలక్ష్మి.

ఎలాగయినా మొగవాళ్ళకన్నా ఆడవాళ్ళు సులభంగా, త్వరగా పరిచయం చేసుకుంటారు. పై భాగాల ఆడవాళ్ళ రాకపోకలు తమ ఇంటికి బాగానే వుంటున్నట్టు గ్రహించాడు భగవంతం రెండుమూడు రోజుల్లోనే.

ఓనాడు భగవంతం బయటికి పోబోతుండగా వీధిలోంచి వస్తూ మెట్లెక్కిపోతున్న సంగమేశ్వరం ఆగి "చూడండీ! ఈ రాత్రికి మా ఇంట్లో భోంచేద్దాం!" అని భగవంతాన్ని ఆహ్వానించాడు.

"ఏమిటి విశేషం?" అన్నాడు భగవంతం.

"ఏదో ఒక చోటవున్నాంగా - కలిసి భోంచేద్దాం!" అన్నాడు సంగమేశ్వరంగారు. అంతవరకూ పరాయిఇళ్ళల్లో శుభసమయాలప్పుడూ, అయినవారి ఇళ్ళల్లో అశుభ సమయాలప్పుడూకూడా భోజనానికి వెళ్ళటమే అలవాటుపడిన భగవంతానికి ఇలాటి విందులు చాలా కొత్త.

"బాగానేవుంది. కాని శనివారం రాత్రి నేను భోంచెయ్యనే!" అన్నాడు భగవంతం. సంగమేశ్వరంగారు 'సీ నామ రూపములకు నిత్యజాయ మంగళం' అని పాడినంత జోరుగా మూడు సెకనులు మాట్లాడి-బుంగ మూతితో మెట్లెక్కుతూ నిష్క్రమించాడేకాని "పోనీ రేపు (ఆదివారం) కాకపోతే మీకెప్పుడు వీలవుతుందో చెప్పండి-అప్పుడే భోంచేద్దాం!" అనన్నా అనలేదు. ఇది మరొక పరీక్ష కాకపోతే మరేమిటి?

దేవతలు మానవులమల్లే వచ్చి ఒకరి త్యాగం, ప్రేమ, శౌర్యం, దాతృత్వంలాటివి పరీక్షించటం, వాడు లేక అది ఆపరీక్షలో నెగ్గటం, తర్వాత ఆ దేవతలు తమ నిజ స్వరూపాలు చూపో లేక తమ అసలుపేర్లు చెప్పో ఆ దౌర్భాగ్యుడిని-లేక ఆ నిర్భాగ్యురాలిని ఆశీర్వదించటం, ఆతర్వాత అతని కథ శుభాంతంగా కంచికివెళ్ళటం మొదలైనవి లేక ఆమె జీవితం మంగళప్రదమైనట్టు పురాణాల్లో వ్రాసి వుండటం, ఎవరో చదివి చెప్పితే తాను విని వుండటం భగవంతానికి కొత్తకాదు. కాని తనొక సామాన్యమానవుడు-తన జీవితం పురాణం కాదుకదా?

గృహాన్వేషణోద్యమంలో భగవంతం వూళ్ళో అన్నిప్రాంతాల్లో తలదాచుకుంటూ కాలుకాలిన పిల్లిలా తిరగటం సహించలేక అతని సతి, ఇల్లు దొరికేవరకూ శనివారాల రాత్రిళ్ళు భోజనం చెయ్యనని మొక్కుకుంది - ఎవరికో, దేముడికే తెలియాలి! వారంలో ఒకపూట అన్నం మానెయ్యటం ఆరోగ్యమే కాని శనివారాల రాత్రిళ్ళు పస్తున్నంతమాత్రాన ఇల్లు దొరకదు అని భగవంతం తన భార్యకు హితోపదేశం చేసినా ఆవిడ వినకపోయేసరికి "పీఖర్మ!" అని వూరుకున్నాడు. రెండు పౌర్ణమిలు, మూడు అమావాస్యలో లేక మూడు అమావాస్యలు రెండు పౌర్ణమీలో దాటిం తర్వాత సహధర్మచారిణి ''నేను శనివారాలు భోజనం మానేస్తే లాభంలేదు - మీరూ మానాలి!'' అని పెదరావూరు పేచీపెట్టింది. పెదరావూరు పేచీ అంటే తుని తగవు తాతలాటిదని భగవంతానికి బాగా తెలుసు పాపం! భగవంతానికి గుండెదడ పుట్టింది. మరి అతనికి అభోజనం అసలు పడదు! ప్రియురాలు అతని గుండెదగ్గిర చెవిపెట్టి వినటం బాగానేవుంది కాని ''వొట్టికబుర్లు; గుండె దడాలేదు - గిడాలేదు!'' అనటం అతనికేం మనస్కరించలేదు.

మునిసిపాలిటీవాళ్ళకు చిక్కిన కుక్కయినా తప్పించుకోవటం కద్దు. కాని భగవంతం ప్రేయసి రుసరుసలు, క్రోధవీక్షణాలు, పరుషవాక్కులు, ముఖావరోహణాలు తప్పించుకోలేక పోయాడు. ఉత్తమా ఇల్లాలు నుసురుపెట్టటం దేనికని అతడు మనసా వాచా దిగజారిపోతున్న సమయంలో అలివేణి ''మీరూ శనివారాల రాత్రిళ్ళు భోజనం మానేస్తేనే కాని చస్తే నే బతికి వుండగా మనకు ఇల్లు దొరకదు!'' అని సమయోచితంగా పోసిన పిరికిమందు వజ్రాయుధమై కర్మణా చేసింది. ఆ దంపతులు శనివారాల రాత్రిళ్ళు నిరాహారదీక్ష పూనారు.

కాని అలా శనివారా లుంటున్న ద్వైతులు ఆ దీక్ష సమయంలో బాదంహల్వా, జీడిపప్పు, కిస్మిస్ చేర్చిన పాలు, రవ్వ కేసరి ఇత్యాది తగు మోతాదులలో చపాయించటం ఎరిగిన భగవంతం అర్ధాంగి నుద్దేశించి ఓసారి కనుబొమలు ఎగరవేశాడు. ఆమె అపార్థం చేసుకుందని తెలియగానే అలాటి అనవాయితీని పెళ్ళానికి చెప్పాడు.

"అలాటి వాళ్ళంతా పరాయి వూళ్ళల్లో బంధువు లింటికి వెళ్ళినప్పుడు, లేక కొంత మంది కలిసి సహకార భోజన సదుపాయాలు సమకూర్చుకోవాలిసి వచ్చినప్పుడు లేక, మరియు తమకంటె క్రింది అంతస్తులో వున్నవారిపట్ల చూపే సానుభూతికాని మరేం కాదు!" అని తాపీగా పెదిమ విరిచింది శ్రీమతి భగవంతం. అయితే భర్త ఖిన్న వదనం చూసి రెండురోజులయిన తర్వాత ఆయనకుమాత్రం "ఉప్మా" వరకు అనుమతి ఇచ్చింది.

"ఉప్మాలేంది ఏం బాగుంటాయి పెసరట్లు?" అన్నాడు భర్త.

కొడవటిగంటి కృష్ణమూర్తి

"పెనరట్లేమిటి?" అని ఆశ్చర్య పోయింది భార్య.

"అదేలే! పెసరట్లు లేంది ఉప్మా బాగుండదే!" అన్నాడు భర్త.

"నయించకపోతే మానెయ్యండి!" అన్నట్టుగా వినిపించింది అలివాణి. పేచీ మొనటికి రావటంచూసి "పోనీ ఉల్లిపాయ లైనా ఆ ఉప్మాలో తగలెయ్యరాదూ?" అన్నాడు భగవంతం.

''ఇక్కడెవ్వరూ తగలెయ్యటానికి లేరు. పైగా శనివారం ఉల్లిపాయ అసలు ముట్టుకో రాదు!''

''పోనీ రెండు టొమేటోలన్నా వేస్తూ వుండు!'.


''మీ కన్ని హోటలు మనసులు!'' అని తాళి కట్టించుకున్న కలికి ఎగతాళి చేసింది.

పండు టొమేటోలకాలం అయిపోయినా ఇల్లు వాసనేలేదు. హోమియోపతి చికిత్సా విధానంలో 'లక్ష పొటెన్సీ' వేసినట్టు భగవంతం భార్య ఉప్మాకూడా మగ్గూర్ చేసింది. అయినప్పటికీ ఇంటిశబ్దమే లేదు. అలా రెండు సంవత్సరాల శనివారాల రాత్రిళ్ళ ఉపవాసానంతరం కాటోలు భగవంతానికి ''ఇల్లు' అనేమాట కనిపించింది.

గాంధిచౌకు సమీపంలోని రెండవవీధిలో మొదటి ఇల్లయిన మూడంతస్తుల మేడలో ఎవరో క్రిందిభాగం ఖాళీచేసి పోతున్నారనీ ఆ క్రిందిభాగం అద్దెకు దొరకటానికి అవకాశం వుందనీ అనుకోని అదృష్టం కలిసి రావటంతో పక్షంరోజుల క్రిందట భగవంతానికి కబురు వచ్చింది. కష్టపడి సంపాదించుకున్న ఉద్యోగం వదులుకుని వుంటూన్న వూరినుంచి వెళ్ళిపోవటమా, మానటమా అని సతమతమవుతున్న భగవంతం వాకబు చేయగా 'కొన్నివేలు' కనక గృహకట్నం' దాఖలు చేసుకుంటే (వరకట్నం మల్లేనే గృహకట్నం ఓనిషేధం లాంటిదే. అయితే వరకట్నం యిచ్చేసిన వాళ్ళు, మగసంతతివుంటే, మళ్ళీవరకట్నం గుంజవచ్చు. గృహ కట్నానికి ఆ పేచీ, అదృష్టంలేదు) ఆ నదరు క్రిందిభాగం లభించగలదనీ తెలిసొచ్చి, బేరంలోకి దిగగా, గృహకట్నం కాక భగవంతం ఇదివరకు పెద్దమనిషి యిచ్చేస్తూ వచ్చిన దానికంటే నెల నెలా హెచ్చు అద్దె ముట్టచెప్పవలిసి వుంటుందనీ, అలా అర్పించుకోటానికి భగవంతం ఏనెల అయినా మోరాయించవచ్చును కనుక అతను మూడునెలల కొత్త అద్దె మొత్తం ముందే చెల్లించవలిసి వుంటుందనీ. ఏమయినా యావత్ వ్యవహారం అమీ తుమీ తేల్చుకోటానికి ముచ్చటగా మూడురోజుల గడువే వుందని హెచ్చరిక చేయబడినాడు.
భగవంతం బెదిరిపోయి భార్యతో సంప్రతించాడు. ''శనివారాల మహోత్యం వృధా పోలేదు - ఇల్లు జారిపోనీయకండి!" అని ఆదేశం వచ్చింది. భగవంతం, గత్యంతరం లేక 'కాబూలీ వడ్డీ'మీద దాఖలుచేసి, ముడుపుచెల్లించాడు. వెంటనే తిథి వార నక్షత్రాలు చూసుకుని రాహుకాలం దాటిం తర్వాత గృహాన్వేషణ ఫలం స్వీకరించాడు.

ఇల్లు దొరికినా శ్రీమతి తానుమాత్రం ఇంకా శనివారా లుంటాననీ, ఇష్టమైతే శ్రీవారు ముప్పూటలా 'అన్నం' తినవచ్చనని తిండిలో ఆంక్షను తొలగించటమేకాక ప్రమోషనుకూడా ఇచ్చింది. కాని ఎందు






వల్లనో భగవంతం భార్యతోనే పస్తువుంటున్నాడు. భగవంతం అలా ఇంకా శనివారా లుండటానికి కారణం ఆ ఇల్లు తమ ఇద్దరు పిల్లల స్కూలుకూ దగ్గర్లో వుండటం కావచ్చు అని ఫ్రాయిడ్ ప్రశిష్యుడెవడైనా చెప్పగలడు!

ఆడవాళ్ళ విషయం ఏమయినా, సంగమేశ్వరంగారి భోజనాహ్వానానంతర ధోరణి భగవంతానికి కష్టం కలిగించింది. భగవంతం 'ఇరుగుపొరుగు సఖ్యత ఉద్యమం' సంగమేశ్వరంగారి విషయంలో రంగుమారి ఆయన ఇప్పుడు దబదబా చప్పుడుచెయ్యకుండా మెట్లుదిగి పోతున్నాడు! స్నేహం పైవారితో చెయ్యాలి అని ఏదో పత్రికలో అదివరకే చదివివున్నవాడే భగవంతం. అందుకని సంగమేశ్వరంగారు పిలవగానే ఆ శనివారం రాత్రే 'అపుపోసన' ప్రారంభించి పైవారితో స్నేహం వగైరా పాటించివుంటే బాగుండేదా అని భార్యను సలహా అడిగాడు.

"ఇది మీ కింత క్లిష్టమైన సమస్య అయినప్పుడు పూర్వాపరాలు ఆలోచించి ఆనక్క చెపుతానని లౌక్యంగా సూచించలేక పోయారో; లేక మీ కంత దివ్యమైన ఆలోచన తట్టలేదా! ఉన్నమాట పుసుక్కున అనేస్తిరి. ఇహ ఈ గతజల సేతుబంధనం దేనికి? సంగమేశ్వరంగారు ఎందరిని ఎప్పుడు భోజనానికి పిలుస్తూవుంటాడోకాని అతగాడు పిలవగానే, పిలవబడిన ప్రతివాడూ వచ్చితీరాలిసిందే; ఎవరికైనా వీలుకాక తగిన కారణంవుండి రాలేకపోతే ఆయన అర్థంలేని అహం దెబ్బతినాలిసిందే."

భగవంతం తన ఇల్లాలి సినిమాధోరణి డైలాగుచూసి అదిరిపోయాడు. కొంచెం సేపయినతర్వాత భార్యమూడ్ మారివుండటం చూసి "పోనీ మనమే సంగమేశ్వరం గారిని భోజనానికి పిలిస్తే!" అన్నాడు భగవంతం.

భార్యకు పాతమూడ్ తిరిగి రాలేదుకాని "దేనికి?" అనిమాత్రం అడిగింది. దేనికి

అని అడిగితే మరి సమాధానం చెప్పటం కష్టమే! అవును దేనికి? 'ఇరుగు పొరుగు సఖ్యత' అని చెప్పితే అదీ సినిమా డైలాగ్ లాగే వుంటుంది. ఏ సమాధానం చెప్పకుండా భగవంతం రొశాయించటంచూసి ఆవిడ "సరే-మీ యిష్టం!" అంది.

పండగా పర్వమూ కాకుండాచూసి, అది వారం అని రూఢిచేసుకుని పైనున్న సంగమేశ్వరంగారిని ఆహ్వానించటానికి ఆయన భాగంలోకి పోబోతూ వీధిలోంచి వస్తూన్న ఆయన్ను చూసి, ఆగి ఆయన దగ్గిరికి రాగానే మెట్లదగ్గిరే ఆ రాత్రికి తన యింటికి భోజనానికి ఆహ్వానించాడు భగవంతం. 'ఎదురుపడితే పిలవటమా - ఇంటికొచ్చి పిలవటం మర్యాద' అన్న మొహంపెట్టాడు సంగమేశ్వరం. కాని వెంటనే తన అంగీకారాన్ని సూచించాడు. భగవంతానికొక పెద్ద సమస్య చాలా సులభంగా పరిష్కారమైపోయింది. ఇంట్లోకి వెళ్ళి ఆ శుభవార్త భార్యకు చెప్పాడు.

ఓ అరగంట గడిచిందేమో - ఎవరో తలుపుతట్టారు. తలుపుతీసిచూస్తే సౌభాగ్యంగారు!

“రండి - లోపలికి దయచెయ్యండి!” ఆయన్ను భగవంతం ఆహ్వానించాడు. సౌభాగ్యంగారు లోపలికి ప్రవేశించకుండా “చూడండీ! ఈరాత్రికి మీతో కలిసి భోం చెయ్యాలనివుంది. కులాసాగా కబుర్లు చెప్పుకుందాం! వస్తారా?” అన్నాడు సౌభాగ్యంగారు.

మళ్ళీ ఈ పరీక్షతో భగవంతం కాస్త బుర్ర అర క్షణంలో వేడెక్కిపోయింది. ఎలా అంగీకరించటం? ఎదురుగా వున్న, ఇంకా మేడమీదవున్న పెద్దమనిషి ఆయిన సౌభాగ్యంగారిని ఆహ్వానించకుండా ఆయన క్రిందభాగంలో వుంటున్న సంగమేశ్వరంగారిని ఆ రాత్రికే తాను భోజనానికి పిలిచాననైనా ఎలా చెప్పటం?

“మంచిదే - కాని ఈరాత్రికి వీలుపడదే మీకు వీలయినప్పుడు మరోసారి చూద్దాం!”

“మీయిష్టం!” అని వెనక్కి తిరిగైనా చూడకుండా - వీధిలోంచి వస్తూవుండటం వల్ల కామాలు - మేడమీదికి వెళ్ళిపోయాడు సౌభాగ్యంగారు.

భగవంతం బుర్రకాస్తా పనిచెయ్యటం మానేసింది. పోనీ ఆ రాత్రికి సౌభాగ్యంని

● “పదిరూపాయిలు కావాలి ఇస్తావా?”

“ఇటివ్వు. ఇందులో అయిదురూపాయిలు నువ్వుంచుకో.”

“ఎందుకు?”

“నువ్వు నాకు అయిదు బాకీవుంటావు. నేను నీకు అయిదు బాకీ వుంటాను. మన బాకీ తీరిపోతుంది.”



కూడా ఆహ్వానిస్తే? ఆయన పిలిస్తే తను రావటానికి వీల్లేదనిచెప్పి ఇప్పుడు ఆయన్ను తను పిలవటం సుతలామూ గౌరవప్రదం కాదు. “మీకు వీలయినప్పుడు మరోసారి” అని తను అనటంలో కూడా అర్థంలేదు. ఆలోచిస్తే, ఆ రాత్రికి వీలయ్యే తనను ఆయన ఆహ్వానించాడు. ఆయన పిలిచిన క్షణంలోనే తనెందుకు రావటానికి వీల్లేదో చెప్పి,అప్పుడే ఆయన్ను తనుపిలవటంకూడా మర్యాద లక్షణంకాదు. 'ఏం పరీక్షలు?' అనుకుంటుండగా మళ్ళీ యెవరో తలుపు తట్టారు. తెరిచి చూస్తే సంగమేశ్వరంగారు!

“రండి!” అని పిలిచాడు భగవంతం. సంగమేశ్వరంగారు లోపలికి రాకుండానే “చూడండీ! ఈ రాత్రికి వీలుపడదేమోనండీ-మీకు వీలయినప్పుడు మరోసారి చూద్దాం. ఇక్కడ వుండేవాళ్ళమేగా - మరి ఈ రాత్రికే నన్ను సౌభాగ్యంగారు ఆహ్వానించారు!” అని వీధిలోకి నిష్క్రమించాడు. సౌభాగ్యంగారు భోజనానికి పిలవటం అదో మహా గొప్పఅయినట్టు. 'పైవారితో స్నేహం చెయ్యాలి' అని సంగమేశ్వరంగారుకూడా చదివివుండాలని భగవంతానికి చప్పున అరమైంది!

“ఇరుగు పొరుగు సఖ్యత మంచిదేకాని పైవారితో స్నేహం చెయ్యాలంటే చిక్కులున్నాయి-ఆ రెండూ కుదరవుకాబోలు!” అంటూ భగవంతం వంటఇంట్లోకి వచ్చి కూర్చుంటూ భార్యతో చెప్పాడు.

“ఏమిటీ?” అంది భార్య అర్థంకాక. భగవంతం చెప్పేలోగా మళ్ళీ ఎవరో తలుపు తట్టారు. వెధవ మహాపట్నాలూ - వెధవ తలుపులు తట్టటమూను! శ్రీమతి ముందు గదిలోకివెళ్ళి తలుపు తీసింది. ఎవరో లోపలికి వచ్చినట్టున్నారు. భగవంతం భార్య తలుపేసి మళ్ళీ వంట గదిలోకి వచ్చింది.

“ఎవరొచ్చారట?” అన్నాడు భగవంతం.

“ఆ! స్నానం చెయ్యటానికి సంగమేశ్వరంగారి భార్య. మంచి తీర్థం తీసుకుపోవటానికి సౌభాగ్యంగారి వంటావిడా!- రోజూ భాగోతమే! పొద్దున పదిదాటితే వాళ్ళ భాగాలకు నీళ్ళుఎక్కవుగా. అందుకనే కామాలు పట్టివుండకోరుకూడాను!” అంది శ్రీమతి భగవంతం.

స్నానాలగదిలో నీళ్ళచప్పుడు స్పష్టంగా వినిపిస్తోనేవుంది భగవంతానికి. అదీ సంగతి! పైవాళ్ళు భోజనానికి పిలిచి, ప్రతిఫలంగా కామాలు, రోజూ నీళ్ళకువస్తూ తమతో ఇరుగు పొరుగు సఖ్యత-ప్రకటిస్తున్నారు. కాని ఆ మహావిద్య - పైవారితో స్నేహం చెయ్యటం-భగవంతానికే చేతకాకుండావుంది!

□□□

● వైద్యుడు: “రోజూ రెండుగంటలసేపు ఏకబిగిన గొంతెత్తి అరిస్తే ముసలితనంలో కూడా ఊపిరితిత్తుల బాధలేవీ రావు.”

రోగి; “బహుశా ముసలితనం బాధలుకూడా వుండవు.”